ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 20 | సంచిక : 8 | ఏప్రియల్ 2015

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక
పేజీలు : 20
గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)
చందా
సంవత్సర చందా:రు|| 150/-
విడి ప్రతి : రు|| 15/-
చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప|| గో|| జిల్లా, ఆం|| ప్ర||
పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

17-02-2015
జిన్నూరు
05-03-2015
చించినాడ

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 17-02-2015, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ సభలు పెట్టటంలో ప్రధానమైన ఉద్దేశం ఏదో ఒక మతాన్ని ప్రచారం చేయటంకాదు. మనిషి అయిన తరువాత రకరకాల కారణాల వల్ల భయం వస్తూఉంటుంది, దుఃఖం వస్తూఉంటుంది, అశాంతి వస్తూ ఉంటుంది, ఆందోళన వస్తూఉంటుంది. సముద్రంలో కెరటాలు వస్తూ ఉంటే ఆ కెరటాల మధ్యన స్నానం చేసి ఎలా బయటపడతామో అలాగే మీకు వాతావరణాన్నిబట్టికాని, వ్యక్తిగతంగాకాని, సహవాసదోషం వలనగాని ఇలా ఎన్ని సమస్యలు వచ్చినా వాటికి అతీతంగా మీరు దుఃఖం లేని స్థితిలో, అశాంతిలేని స్థితిలో ఉండి మీరు ఒంటరిగా ఉన్నా, నలుగురి మధ్యలో కూర్చున్నా కూడా పూర్ణశాంతి, పూర్ణసుఖం మీచేత అనుభవింప చేయటమే ఈ సభలయొక్క ప్రయోజనం. అంతేగాని ఇవి ఎవరి గురించో ప్రచారం చేయటానికి కాదు. ఇవి కులమతాలకు అతీతంగా జరుగుతున్న ప్రవచనాలు. ఇందులో రిజర్వేషన్స్ ఏమీ లేవు. జీవన్ముక్తుడు ఎటువంటి సుఖాన్ని అనుభవిస్తున్నాడో మీ శరీరాలు ఈ భూమి మీద తిరుగుతున్నప్పుడే అటువంటి సుఖాన్ని మీరు అనుభవిస్తూ, ఈ శరీరాన్ని విడిచిపెట్టి జీవుడు బయటకు పోయేటప్పుడు అశాంతితో కాకుండా శాంతిగా శరీరాన్ని విడిచిపెట్టేటట్లు చేయటమే ఈ ప్రవచనాల యొక్క ప్రయోజనం.

ఈరోజు శివరాత్రి. మనకు కృష్ణాష్టమి, శ్రీరామనవమి ఎటువంటివో శివరాత్రి అటువంటిదే. రామావతారం, కృష్ణావతారం అని చెపుతారు, శివుడు నిత్యావతారం అంటే నిత్యం ఉండే అవతారం. ఈరోజు సాంప్రదాయం పగలు ఉపవాసం, రాత్రి జాగరణ చేస్తారు. ఉపవాసం అంటే కేవలం అన్నం తినటం మానివేయటంకాదు, మనస్సులో విషయచింతన లేకుండా ఉండాలి. జాగరణ అంటే ఏవో సినిమాలకు

వెళ్ళటం, టీవీలు చూసి కాలక్షేపం చేయటంకాదు, శివనామస్మరణతో గడపాలి. శివుడు అంటేనే మంగళం. ఆయన మనకు శుభాన్ని కలుగజేస్తాడు. ఆయన నిరాడంబరుడు. ఆయనకు ఏమీ అక్కరలేదు. కాబట్టే ఇతరులు ఏదైనా అడిగితే వరాలు ఇస్తాడు. అన్నీ నాకే కావాలి అనుకొనేవాడు ఇంక ఇతరులకు ఏమి ఇస్తాడు. వాడికి ఏమీ అక్కరలేదు కాబట్టి నీకు ఏదైనా ఇస్తాడు. వాడు శివుడు. అరుణాచలాన్ని తొలి లింగం అంటారు. శివుడిని లింగరూపంలో అర్చన చేస్తారు. పరబ్రహ్మంకు రెండు ముఖాలు. 1. విష్ణువు, 2. శివుడు. ఏ ముఖం ద్వారా వెళ్ళినా మనం లోపలకు వెళతాము. హిందువులు శివుడినిగాని, విష్ణువునిగాని ఉపాసన చేయటం ద్వారా వారిని ఆధారంగా చేసుకొని ఈ జీవికోటికి, సృష్టికి ఆధారంగా ఉన్న పరబ్రహ్మంను పొందుతారు. శివలింగాన్ని ఆరాధన చేయటం, ధ్యానం చెయ్యటం ద్వారా మనకు ఉన్న అలవాట్లలోనుండి విడుదలపొందుతాము. శివుడు లయకారకుడు. ఆయన మీ మనస్సును అంతర్ముఖం చేస్తాడు. మీ మనస్సు అంతర్ముఖమైతే ఇంక బాహ్యగొడవలలోనుండి, రాగద్వేషాలనుండి అన్నింటినుండి మీరు విడుదలపొందుతారు. శివలింగాన్ని ధ్యానం చేయటంవలన మీ మనస్సు అంతర్ముఖం అయ్యి ఆత్మానుభవం పొందటానికి మీరు అర్హులు అవుతారు.

మనం అందరం ఏదో రూపంతో తాదాత్మ్యం పొందుతున్నాము, నామముతో తాదాత్మ్యం పొందుతున్నాము, గుణముతో తాదాత్మ్యం పొందుతున్నాము. అంటే మనం సాకారంలో ఉన్నాము. కాని సత్యం నిరాకారం, నిర్గుణం. సాకారంలో నుండి నిరాకారంలోనికి వెళ్ళటానికి మనకు నూటికి నూరుపాళ్ళు సహకరించేవాడే శివుడు. పరమేశ్వరుడు చెప్పిన మాటలు, మహాత్ములు చెప్పిన మాటలు మనం చదువుతున్నాము, ఎవరైనా చెపితే వింటున్నాము. ఆ మాటల మీద మనకు విశ్వాసం కలగాలి కదా! ఆచార్యులు, మహాత్ములు, యోగులు ఈ భూమిమీద తిరుగుతున్నారు అంటే ఈశ్వరుడే ఆ రూపం ధరించి ఉన్నాడు. రామకృష్ణ పరమహంస మాటలు చెప్పాడు అంటే అక్కడ పరమేశ్వరుడే ఆ రూపం ధరించి చెపుతున్నాడు. అందుచేత వారిపట్ల గౌరవం లేకుండా, ప్రేమలేకుండా, వారిపట్ల అంకితభావం లేకుండా, ఎంతోకొంత వారిపట్ల భక్తి లేకుండా వారు చెప్పిన మాటలమీద మనకు విశ్వాసం కలుగదు. నీ హృదయంలో ఒక నిజం ఉంది. దానికి చావులేదు, పుట్టుకలేదు. మీ హృదయంలో ఉన్న నిజానికి ఈ దేహానికి అణుమాత్రం కూడా సంబంధం లేదు. కాని లేదా అంటే ఉంది. అది నీకు అర్థంకాకపోవచ్చు, నీ మెదడుకు అందకపోవచ్చు, నీ కళ్ళకు కనిపించకపోవచ్చు. మహాత్ముల సమక్షంలో, యోగుల సమక్షంలో నీ ప్రయత్నంతో సంబంధం లేకుండా అది నీకు స్ఫురిస్తుంది. అది నీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు నువ్వు దానిని అనుభవించగలవు కాని పుస్తకాలు చదవటం వలన, ఉపన్యాసాలు వినటం వలన వచ్చేది కాదు. నీ హృదయంలో ఉన్న నిజాన్ని

నువ్వు తెలుసుకోలేవు, అది నీకు తెలియబడాలి, మేము బుద్ధిమంతులము అని మీరు అనుకోవచ్చు. మీరు అనుకొన్నంత మాత్రంచేత మీరు బుద్ధిమంతులు కారు. మీరు బుద్ధిమంతులు అని హృదయంలో ఉన్న నిజం అనుకోవాలి. కర్తృత్వం లేకుండా కర్మ చేసేవాడు మాత్రమే బుద్ధిమంతుడు. కర్తృత్వం లేకుండా కర్మచేస్తే నువ్వు చేసినా చెయ్యనివాడితో సమానము, అలా చేయటం వలన నువ్వు టైర్ అవ్వవు. అంటే పనిచేయటం వలన నువ్వు టైర్ అవ్వవు, నేను చేస్తున్నాను అనే భావన వలన టైర్ అయిపోతావు.

మహాత్ములతోటి, యోగులతోటి సాంగత్యం మంచిది. వారు మనతో ఎక్కువగా మాటలు చెప్పరు, వారు చేసేది మౌనంగా చేసుకొనిపోతారు. వారు మీకు చేసే సహకారం అసలు మీకు తెలియాలి అని కూడా వారు అనుకోరు. జ్ఞానికి ఇతురులు లేరు. తన హృదయంలో ఏదైతే ఉందో అదే ఇతరుల హృదయాలలో చూస్తాడు. ఇతరుల హృదయాలలో ఏదైతే ఉందో అదే తన హృదయంలో ఉందని వాడికి తెలుస్తూ ఉంటుంది, అంటే ఆ వన్‌నెస్ వాడికి తెలుస్తూ ఉంటుంది. మాటలకంటే మౌనం మంచిది. మౌనానికి ఉన్న శక్తి మాటకి లేదు. మీ శరీరాలు ఎక్కడ ఉన్నా, ఏ దేశంలో ఉన్నా, ఏ ప్రాంతంలో ఉన్నా భగవంతుడి పట్ల మీకు మానసికఅనుబంధం ఉండాలి. కైలాసంలో శివుడు ఉన్నాడు. అరుణాచలంలో శివుడు ఉండటంకాదు, అరుణాచలమే శివుడు అంటే ఆ కొండే శివుడు. ఆ కొండ దేవుడు అనటం నిజమా అని భగవాన్‌ను అడిగారు. నీకు నిజం కావాలా? ఈ దేహమే నేను అని నువ్వు అనుకొంటున్నావు, అది నిజమా? ఈ శవాన్ని నువ్వు అనుకోవటం ఎంత నిజమో, ఆ కొండ నేను అని శివుడు అనుకోవటం కూడా అంతే నిజం. నిజమైన అరుణాచలం నీ హృదయంలోనే ఉంది.

కొంతమంది ఏమంటున్నారు అంటే మాకు ఇంటి దగ్గరే బాగుంది అరుణాచలం వస్తే కొత్తవాసనలు వస్తున్నాయి అంటున్నారు. మీకు తెలియకుండా మీ హృదయంలో చాలా బలహీనతలు ఉంటాయి. పునర్జన్మను తీసుకొనివచ్చే కారణాలు మీ హృదయంలో ఏమి ఉన్నాయో మీకు తెలియదు. మీ హృదయంలో ఏదైనా బలహీనత ఉంటే మీకు తెలియకుండా దానిని బయటకు గెంటటానికి అవకాశం లేదు. అవి మీకు తెలియటానికే మీ హృదయాన్ని కెలికి వాటిని మీ మెదడులోనికి తీసుకొనివచ్చి మీలో ఏ బలహీనతలు ఉన్నాయో మీకు తెలియజేస్తున్నాడు, అదే అరుణాచలేశ్వరుడు చేస్తున్నాడు. దానిని చూసి మీరు కంగారుపడవద్దు. మీలో ఉన్న బలహీనతలను మీకు తెలియజేసి వాటిని బయటకు గెంటి మిమ్మల్ని పరిశుద్ధుడిగా చేసి ఆయనలో ఐక్యం చేసుకొంటాడు. స్వామీజీ రామకృష్ణుడితో ఏమనేవాడు అంటే మీరు నావంక చూస్తున్నారు ఏమిటి? ఇక్కడ ఇంక జనం లేరా చూడటానికి, నా వంక అలా చూడకండి అనేవాడు. రామకృష్ణుడు ఏమన్నాడు అంటే నాకు నీ మీద ఇష్టం పోవటంలేదు చూడాలని నిన్ను చూడటంలేదు, ఇష్టాన్ని పోగొట్టుకోలేక చూస్తున్నాను అని చెప్పాడు. నరేంద్రుడు రామకృష్ణుడి

దగ్గరకు మొదట వచ్చినప్పుడు వెస్ట్రన్‌డోర్‌లోనుండి లోపలకు వచ్చి కూర్చొంటాడు. స్వామీజీని నీ పేరు ఏమిటి, నువ్వు ఎక్కడనుండి వచ్చావు అని రామకృష్ణుడు అడగలేదు. చైల్డ్, చైల్డ్, డియర్ చైల్డ్, మైడియర్ చైల్డ్, కం, కం, కం టు మి, ఐ కెనాట్ లివ్ వితౌట్ సీయింగ్ యు, నిన్ను చూడకుండా నేను బతకలేను, నిన్ను చూడకుండా నేను ఉండలేను అంటాడు రామకృష్ణుడు. ఆ మాటలలో ఉన్న బరువు చూడండి, ఆ మాటలలో ఉన్న పూర్వజన్మల అనుబంధం చూడండి. అది జన్మాంతర అనుబంధం. మీలో ఎవరికైనా జన్మాంతర అనుబంధం ఉంటే చనిపోయేవరకు ఒకేరకంగా ఉంటారు. ఒకరి పొరపాట్లను ఇంకొకరు మన్నించుకుంటారు. ఇంకో రహస్యం ఉంది. గురువు శిష్యుడిని ఎన్నుకొన్నాడు అనుకోండి ప్రమాదం లేదు. శిష్యుడు గురువును ఎన్నుకొంటే ఆ గురువు సిగరెట్లు కాలుస్తూ ఉంటే ఏమిటి గురువు సిగరెట్లు కాలుస్తున్నాడు అని శిష్యుడు అనుకొంటాడు. అదే గురువు కనుక శిష్యుడిని ఎన్నుకొంటే ఆ గురువు గొడవ ఏమి శిష్యుడికి అక్కరలేదు.

మీరు ఏ దేశంలో ఉన్నా, ఎక్కడ ఉన్నా భగవంతుడితోటి మానసిక అనుబంధం పెట్టుకోండి. మీరు ఏ భగవంతుడితో అయితే మానసిక అనుబంధం పెట్టుకొన్నారో ఆయన మీ హృదయంలో కూడా ఉన్నాడు. బయటఉన్నవాడు నీ మనస్సు బహిర్ముఖం అవ్వకుండా నిన్ను కాపాడి, నీ మనస్సును అంతర్ముఖం చేసి లోపలఉన్న అంతర్యామికి పట్టియిస్తాడు. అంటే బయటఉన్న ఈశ్వరుడు నిన్ను లోపలకు గెంటుతాడు. నీలోపల అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడు నిన్ను లోపలకు గుంజుకొని ఆయన స్వరూపాన్ని నీకు ఇస్తాడు. బయట ఉన్నవాడు, లోపలఉన్నవాడు వేరుకాదు, ఇద్దరూ ఒక్కటే, ఉన్నదంతా ఒక్కటే. గురువు యొక్క శరీరం చనిపోయిన తరువాత ఆయనతో సంబంధం తెగిపోతుందా అని అడుగుతున్నారు. గురువు అంటే ఆ శరీరమా? గురువు అంటే ఆ శరీరమే అయితే శరీరం పోయినప్పుడు అనుబంధం తెగిపోతుంది. గురువు అంటే శరీరం కాదు. అందుచేత ఆ శరీరం మరణించిన తరువాత కూడా నీకు ఆయనతో ఉన్న అనుబంధం నిలుస్తుంది. నీకు తెలుసున్నా, తెలియకపోయినా నీకు ఆత్మసాక్షాత్కారం కలిగేవరకు అనుగ్రహం నిన్ను వెంటాడుతుంది. ఆయనే గురువు. ఇప్పుడు మేము భగవాన్‌ను వదులుకొందాం అనుకొంటున్నాము, అయితే ఆయన మమ్మల్ని వదిలేలా లేడు, ఎందుచేతనంటే అది పులి నోట్లో పడ్డ మాంసపు ముక్క. మనం పట్టుకొంటే ఒకవేళ విడిచిపెట్టేయాలంటే విడిచిపెట్టేయవచ్చు. కాని ఆయన పట్టుకొన్నాడు కాబట్టి మనం విడిచిపెట్టేద్దామన్నా ఆయన విడిచిపెట్టే అవకాశం లేదు. గురువు నిన్ను అనేక రకాలుగా అనుగ్రహించవచ్చు. రామకృష్ణుడు టచ్ చేసేవాడు. ఒకసారి రామకృష్ణుడు ఆయన కాలు తీసి నరేంద్రుడి తలమీద పెట్టాడు. ఏమయ్యా ఏమిటి నువ్వు ఏమి చేస్తున్నావు అన్నాడు. నాకు ఇల్లు ఉంది, ఇంటి దగ్గర అమ్మ, తమ్ముళ్ళు ఉన్నారు, వారు కనబడకుండా పోతున్నారు

అన్నాడు నరేంద్రుడు. అంటే నిర్గుణంలోనికి, నిరాకారంలోకి ఎంతవరకు వెళ్ళగలడో చూస్తున్నాడు. నరేంద్రుడికి భయం వేస్తోంది. ఆయన సాకారాన్ని, సగుణాన్ని విడిచిపెట్టలేకపోతున్నాడు. అప్పడు కాలు తలమీద నుండి తీసేసి సరిపోతుంది అని చెప్పలేదు, ప్రస్తుతానికి సరిపోతుంది అన్నాడు రామకృష్ణుడు. సాకారంలోనుండి నిరాకారంలోనికి వెళ్ళటానికి ఆధ్యాత్మికంగా కొంతస్థాయి ఉండాలి. ఒక మహాత్ముడి యొక్క విలువ ఇంకో మహాత్ముడికి తెలుస్తుంది కాని సామాన్య మానవులకు అర్థంకాదు. ఎఱ్ఱవాడ జైలులో ఉండగా మహాత్మాగాంధీని చూడటానికి రవీంద్రనాథ్‌టాగూర్ వెళ్ళారు. మహాత్మాగాంధీ, టాగూర్ కౌగిలించుకున్నారు. సరిపోతుంది అన్నాడు టాగూర్. నాకు ఇంకా సరిపోవటంలేదు అన్నారు గాంధీగారు. ఈ మధ్య ప్రిన్సిపల్ సెక్రటరీగారు జిన్నూరు వచ్చారు. ఆయనకు రమణకేంద్రం కూడా చూపించాము. ఆయన వెళ్ళిపోయేటప్పడు వీడుకోలు చెపుతూ ఈ రోజున మీరు నేను కలుసుకున్నాము, ఈ రోజు మంచి లక్ష్మీవారం అన్నాను. మంచి లక్ష్మీవారమే మీకా నాకా అన్నారు ఆయన. ఎవరికి మంచి లక్ష్మీవారం? మీకు మంచి లక్ష్మీవారమా? నాకు మంచి లక్ష్మీవారమా? అన్నారు. ఈ మాటలు ఎందుకు చెపుతున్నాను అంటే ఎదుటి మనిషిలో ఏదైనా ఔన్నత్యం ఉంటే అది నీకు తెలియబడాలి అంటే ఎంతోకొంత ఔన్నత్యం నీలో కూడా ఉండాలి లేకపోతే అది నీకు తెలియదు. నీకు లేదు అనుకో ఏమీ తెలియదు. నీలో ఎంతోకొంత పవిత్రత లేకపోతే చివరకు శ్రీరాముడే వచ్చి నీ ప్రక్కన కూర్చున్నా నీకు ఏమీ తెలియదు.

నీకు కోరికలు, అలవాట్లు, వాసనలు బలీయంగా ఉన్నప్పడు కొంతకాలం మహాత్ముల సమక్షంలో ఉంటే, ఎవాల్వ్‌డ్ సోల్స్ దగ్గర ఉంటే వారి సమక్షంలో కోరికలు, వాసనలు నెమ్మదిగా అణుగుతాయి, నీ మనస్సు నిర్మలమవుతుంది, నిశ్చలమవుతుంది, సత్యసాక్షాత్కారానికి ప్రిపేర్ అవుతుంది. నీకు ఉన్న బలహీనతలు నువ్వు కాదు, అవి తెచ్చిపెట్టుకొన్న అలవాట్లు. అవి అణిగితేనేగాని నీ మనస్సు నిర్మలమవ్వదు. మనస్సు నిర్మలమైతేగాని నీకు సమాధిస్థితి కలుగదు. అందుచేత వాసనలు అణగటానికి, నిన్ను ఉన్నతస్థాయికి ప్రిపేర్ చేయటానికి మహాత్ములయొక్క సమక్షం అవసరం. అయితే ఒకవేళ నీకు ఏమైనా అనుభవం కలిగితే, నీ హృదయంలో ఉన్న సద్వస్తువు నీకు స్ఫురిస్తూ ఉంటే అది నీ తెలివితేటలు అనుకోవద్దు. మహాత్ముల సమక్షం వలన, గురువు సమక్షం వలన నువ్వు కొన్ని అనుభవాలు పొందుతావు. సనత్‌కుమారుడు వాళ్ళకి దక్షిణామూర్తి సమక్షంలో వాసనలు అణిగిపోయి, పునర్జన్మకారణాలు కాలిబూడిద అయిపోయి సద్వస్తువు స్వరూపంగా వ్యక్తమయ్యింది అంటే అది దక్షిణామూర్తి ఔన్నత్యమేకాని వారి ఔన్నత్యంకాదు. అలాగే నువ్వు ఏదైనా పొందితే అది గురువు దయవల్ల మాత్రమే. నదిని దాటటానికి నావ ఎటువంటిదో ఈ సంసారసాగరాన్ని దాటటానికి సత్సంగం నీకు నావలాగ ఉపయోగపడుతుంది. సత్సంగంకంటే విలువైనది, విశేషమైనది ఈ మూడు

లోకాలలో ఏమీ లేదు అని చెపుతున్నారు. నీకు బ్రాహ్మీస్థితి పొందినవాడు దొరకనప్పుడు సత్యాన్వేషకుడియొక్క సాంగత్యం కోసం అయినా అన్వేషించు. మా చుట్టు ప్రక్కల సత్పురుషులు లేరు అని బుద్ధుడితో అంటే నీకు సత్పురుషులు దొరకకపోతే అడవిలో ఏనుగులాగ ఒంటరిగా బతుకు అంటే నీకు హోలీకంపెనీ దొరకనప్పుడు ఏకాంతవాసం మంచిదే. మీ హృదయంలో ఉన్న సత్యం మీకు అనుభవంలోనికి రావాలి అంటే ఆ అనుభవం పొందినవారి దగ్గరకాని, ఆ అనుభవంకోసం ప్రయత్నం చేసేవారు ఎక్కడ ఉన్నారో వెతికి వారి సమక్షంలోకాని కొంతకాలం జీవించటానికి ప్రయత్నం చేయాలి.

రామకృష్ణుడు చెప్పిన ఒక వాక్యం చెపుతాను. ఈ వాక్యం నన్ను బంధించింది, నా మనస్సును తేలిక పరిచింది. ఈశ్వరుడే కర్త. ఈశ్వరుడు మాత్రమే కర్త కాని నేను కర్తను అని మానవుడు అనుకొంటున్నాడు. కర్తవాడు కాకపోయినా నేనే కర్తను అని వాడు అనుకొంటున్నాడు కాబట్టి వాడికి దుఃఖం వస్తోంది. కర్త ఈశ్వరుడే. నేను ఎంతమాత్రము కర్తనుకాదు అని నోటితో చెప్పటంకాదు, మనస్సుతో స్మరించటంకాదు, ఈ వాక్యాన్ని నీ హృదయంలో అనుభవించినప్పుడు నీవు జీవన్ముక్తుడవు అవుతావు అని చెప్పాడు. దుఃఖానికి కారణం కర్తృత్వం. ఒక మనిషికి దుఃఖం వస్తోంది అంటే అక్కడ కర్తృత్వం ఉండి తీరాలి. కర్తృత్వం లేనివాడికి దుఃఖంలేదు. అర్జునా! కర్తృత్వం లేకుండా మూడు లోకాలను భస్మం చేసినా నీకు దోషం లేదు అని పరమాత్మ చెప్పాడు. నా చేతిలో కత్తి ఉంది అనుకోండి. ఆ కత్తి పుచ్చుకొని ఎవరి తలకాయ అయినా నరికితే పాపం కత్తికి వస్తుందా? నాకు వస్తుందా? మిమ్మల్ని నేను నరకలేదు, కత్తే నరికింది అయినా కత్తికి పాపం రాదు, నాకే పాపం వస్తుంది. ఎందుచేతనంటే ఆ కత్తి నా చేతిలో పనిముట్టు కింద ఉపయోగపడింది. కత్తి చంపినట్లుగా మీకు అనిపిస్తుంది కాని ఆ కత్తితో చంపినవాడిని నేను. అందుచేత దోషం నాకు వస్తుంది కాని కత్తికిరాదు. కత్తిని ఏవిధంగా అయితే నేను ఉపయోగించుకొంటున్నానో ఈ సృష్టిలో ఉన్న జీవకోటిని పరమేశ్వరుడు ఉపయోగించుకొంటున్నాడు.

లక్ష్మణుడు కైకేయిని తిడుతూ ఉంటాడు. అప్పుడు రాముడు ఏమన్నాడు అంటే లక్ష్మణా! మనల్ని తల్లికంటే ఎక్కువగా ప్రేమించినటువంటి కైకేయిలో అకస్మాత్తుగా ఇంతమార్పు ఎందుకు వచ్చింది అనుకొంటున్నావు. నా శరీర ప్రారబ్ధంలో నేను అడవికి వెళ్ళవలసి ఉంది. నన్ను అడవికి పంపటానికి ఈశ్వరుడు కైక నోరును ఉపయోగించుకొన్నాడు కాని కైక ఎవరు మనలను అడవికి పంపటానికి. ఈ దేహం భూమి మీదకు ఎందుకు వచ్చిందో ఆ పని చేయించటానికి కైకను పరమేశ్వరుడు పనిముట్టుకింద ఉపయోగించుకున్నాడు అంతే. మీరు నమ్మినా, నమ్మకపోయినా ఇది సత్యం. నీ శరీరం ద్వారా మంచి జరిగినా, చెడ్డ జరిగినా ఈశ్వరుడే కర్త. నేను కర్తనుకాదు, ఈశ్వరుడే కర్త. చేసేదంతా ఆయనే అని

నోటితో చెప్పినా ప్రయోజనం లేదు, అది నీకు అనుభవంలోనికి రావాలి. ఈశ్వరుడి మీద భక్తి కుదిరినప్పడు ఈ వాక్యం నీకు అర్థమవుతుంది కాని లేకపోతే అర్థంకాదు. రామకృష్ణుడి మాటలలో చెప్పాలి అంటే స్త్రీకి తన భర్తమీద ఎంతప్రేమ ఉంటుందో, పరమలోభికి డబ్బుమీద ఎంత ప్రేమ ఉంటుందో ఈ రెండూ కలవాలి. ఈ రెండూ కలిస్తే మొత్తం ఎంత ప్రేమ ఉంటుందో అంత ప్రేమ నీకు ఈశ్వరుడి మీద ఉన్నప్పడు ఈ వాక్యం అనుభవంలోనికి రావటానికి అది నీకు సహకరిస్తుంది. ఈ వాక్యం హృదయంలో నీకు అనుభవంలోనికి వచ్చినప్పడు ఇంక నీకు జన్మలన్నీ కట్ చేసేస్తారు. ఇంక శవాలను మోయవలసిన పనిలేదు.

కళ్ళు చేసే పని కళ్ళు చేస్తాయి, చెవులు చేసే పని చెవులు చేస్తాయి. మాకు కళ్ళు సరిగా కనబడటంలేదు. నువ్వు ఎలాగు వింటున్నావుకదా, చూడటం కూడా చెయ్యి అని చెవులను అడిగితే అవి చూసిపెడతాయా? లేదు. ఎందుచేతనంటే చూడటం చెవులకు తెలియదు. అలాగే డబ్బుకు చేతకాని పనిని డబ్బుని చేయమని అడగకూడదు. డబ్బు శరీరానికి కంఫర్టు ఇస్తుందికాని మైండ్‌కు కంట్రోలును ఇవ్వలేదు. నీకు వెయ్యికోట్లు డబ్బు ఉన్నా కర్తృత్వం ఉంటే దుఃఖం వచ్చేస్తుంది. ఈశ్వరుడే కర్త, నేను కర్తను కాదు. ఇది నీ రక్తంలో కలిసిపోవాలి. ఈ వాక్యం నీకు అనుభవంలోనికి వస్తే నీ హృదయంలో నుండి ఆనందం పొంగి వచ్చి నీ మెదడును ముంచేస్తుంది.

భగవద్గీతలో ఒక శ్లోకం ఉంది. ఇది నాకు మరింత ప్రియం. ఉన్నదేదో ఉంది, లేనిదేదో లేదు. ఉన్నదానికి లేకపోవటం అంటూ లేదు, లేనిదానికి ఉండటం అంటూ లేదు. అర్జునా! నువ్వు నమ్మినా నమ్మకపోయినా ఇది వాస్తవం, ఇది నిశ్చయం. ఈశ్వరుడు మనలో అంతర్యామిగా ఉన్నాడు. ఆయన మన కళ్ళకు కనబడటంలేదు, మన చెవులకు వినబడటం లేదు. ప్రారబ్దాన్ని బట్టి మన శరీరాలను బొమ్మల కింద ఆడిస్తున్నాడు. మనకు వివేకం, వైరాగ్యం లేని మూలంగా మనలో అంతర్యామిగా ఈశ్వరుడు ఉన్నప్పటికీ ఆయన మనకు అవగాహన కావటంలేదు. 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో ఒక రోజు తెల్లవారుఝామున నాలుగింటికి గాంధీగారిని, మహదేవ్ దేశాయ్‌ని అరెస్టు చేస్తున్నారు. గడియారం రాత్రి 12 గంటలు కొట్టింది. అప్పడు బాపూజీ భార్య బాపూజీని లేపింది. అలా నిద్రపోతున్నారు ఏమిటి? గడియారం 12 గంటలు కొట్టేసింది. నాలుగింటికి పోలీసులు వచ్చి జైలుకు తీసుకొనిపోతారు. ఇంకా నిద్రపోతారేమిటి అంది. ఎప్పడో నాలుగింటికి కదా వెళ్ళేది, ఈ లోపుగా నిద్ర చెడగొట్టటం ఎందుకు అని మరల బాపూజీ పడుకొన్నారు. అదీ వైరాగ్యం అంటే. మనకు అయితే అలా నిద్ర పడుతుందా? నాలుగింటికి జరగవలసింది జరుగుతుంది, ఈలోపులో నిద్ర చెడగొట్టుకోవటం ఎందుకు అని మరల నిద్రపోయాడు. వాడు బాపూజీ. అంటే

అక్కడ వైరాగ్యం ఉండటం వలన ఆందోళన లేదు. ఉన్న విషయం ఉన్నట్లుగా మనకు అర్థం అవ్వకపోవటానికి కారణం ఏమిటి అంటే మనకు వివేకం లేదు, వైరాగ్యం లేదు.

స్వార్థపరుడికి ఆత్మజ్ఞానం కలుగదు. వాడు ఏ మతంలో ఉన్నా, ఏ కులంలో ఉన్నా, వాడికి ధనం ఉండవచ్చు, అధికారం ఉండవచ్చు, పాండిత్యం ఉండవచ్చు, వాడికి ఎన్ని ఉన్నప్పటికీ ప్రపంచంలో ఇంతవరకూ ఏ స్వార్థపరుడికి ఆత్మజ్ఞానం కలుగలేదు. స్వార్థం లేని స్థితికి ప్రతీక పరమేశ్వరుడు. మనం పూర్తిగా స్వార్థం విడిచిపెట్టగలమా అంటే శివుడిలాగ పూర్తిగా విడిచిపెట్టలేకపోవచ్చు, కనీసం కొంతకూడా మనం తగ్గించుకోవటంలేదు. ఎవరు చెప్పినా వారి కుటుంబ సమస్యలగురించి చెపుతారు గాని సమాజం గురించి ఎవరూ మాట్లాడరు. మనం ఎవరికైనా చిన్న సహాయం చేసి ఏదో త్యాగం చేసేసాను అనుకొంటాము. సొమ్ము అంతా పరమేశ్వరుడిదే. నువ్వు ఇతరులకు ఏదైనా సహాయం చేసినా అది తిరిగి నీకే వస్తుందని తెలియకపోవటం వలన నేను ఏదో త్యాగాలు చేసాను అనుకొంటావు. మనస్సు అణగాలి. మనస్సు అణగకుండా ఆత్మానుభవం కలిగే అవకాశం లేదు. ఎంతసేపు వారు తిట్టారు, వీరు కొట్టారు అని ఇలా అనుకొంటూనే చస్తావా? ఇంక నీ జీవితానికి ఒక గమ్యం అంటూ ఏమీ లేదా? నువ్వు పొందవలసిన స్థితి ఏదో పొందటానికి నువ్వు ఏమీ శ్రవణం చేయటం లేదు. అసలు శ్రవణం చేయకుండా నీకు ఏమి తెలుస్తుంది. శ్రవణం చెయ్యాలి కదా!

లోకంలో నీకు ఎక్కడైనా పాపం కనిపిస్తూ ఉంటే నీలో ఉన్న కోరిక, నీలో ఉన్న కోపం, నీలో ఉన్న అసూయ, నీలో ఉన్న లోభిత్వం అంతా కలిపి లోకంలో పాపం కింద కనిపిస్తోంది. నీలో లేనిది బయట ఎక్కడా ఏమీ లేదు. నీకు ఎక్కడ ఏ దోషం కనిపిస్తున్నప్పటికీ ఆ దోషం నీ హృదయంలో కూడా ఉండి ఉండాలి. మనం అందరం బయటనుండి లోపలకు తీసుకొనే వాటిలో చాలా జాగ్రత్తగా ఉంటాము. అన్నం తినేటప్పుడు అందులో నలకలు ఏమైనా ఉన్నాయేమో చూసుకొంటాము. కాని లోపల నుండి బయటకు వచ్చే మాటల విషయంలో జాగ్రత్తపడటంలేదు, ఆలోచన లేకుండా మాట్లాడతాము. మాట సౌమ్యంగా ఉండాలి. నువ్వు మాట చెప్పేటప్పుడు ఇతరులపట్ల ప్రేమ, ఆప్యాయత ఉండాలి. నువ్వు చెప్పేమాట వారికి అవగాహన అవ్వాలి. వారికి సబ్జక్టు అర్థంకాకపోతే మనలోనే ఏదోలోపం అనుకోవాలి. వినేవాడిపట్ల ఆప్యాయత లేకుండా నువ్వు యాంత్రికంగా ఎంత చెప్పినా దాని వలన ఏమీ ప్రయోజనం లేదు.

ఇక్కడ భగవాన్ మౌ గురించి చెపుతున్నారు, రోజుల తరబడి, నెలల తరబడి, సంవత్సరాల తరబడి ప్రవచనాలు చెపుతారా. మీరు ఎన్నాళ్ళు ఇలా చెపుతారు. మీకు నిజమైన మౌనం కుదిరితే, మీ ఇంద్రియాలు మనస్సు హృదయంలో అణిగిపోయి అక్కడనుండి మౌనంవస్తే మీరు జీవితం పొడుగునా ప్రవచనాలు చేసింది, వంద సంవత్సరాలు టీచ్

చేసింది ఒక్క క్షణంలో మీ సమక్షంలో ఉన్న వారికి సత్యాన్ని అందివ్వవచ్చు. నువ్వు ఎంత పండితుడవు అయినా, ఎంత మహోన్నతుడవు అయినా మనస్సు, ఇంద్రియాలు హృదయంలో అణగకపోతే అది జ్ఞానమా? ఇలా నువ్వు ఎన్ని శవాలను మోస్తావు. మాకు వచ్చే జన్మ ఎటువంటి జన్మ వస్తుందని చాలామంది అడుగుతూ ఉంటారు. ఇప్పడు ఈ శరీరం ఎలా ఉందో వచ్చే జన్మ వచ్చినప్పడు ఇంకో శరీరం ఉంటుంది. అది ముసలిది అయిపోతుంది, చనిపోతుంది ఇంకో జన్మ వచ్చినా అది ఉంటుందా? ఇప్పడు ఒక అబద్ధంలో ఉన్నావు. ఒక అబద్ధంలో ఉండి ఇంకో అబద్ధం గురించి తెలుసుకోవాలి అనుకొంటావు ఏమిటి? కొన్నివిషయాలు మన మలినబుద్ధికి అందవు. మనకు ఏకాగ్రత, పవిత్రత లేకపోవటం వలన ఆ విషయాలను గ్రహించే శక్తి లేకపోవటం వలన కొన్ని విషయాలు మనకు అందవు. శివుడు గురువులకు గురువు. ఆయన దక్షిణామూర్తి అవతారం ఎత్తి మొత్తం సబ్జక్టు అంతా ఒక మాట లేకుండా, మౌనంగానే వారి హృదయాలకు హత్తుకునేలా చేసాడు. అది మౌనం యొక్క వైభవం. నువ్వు మౌనంగా ఉన్నప్పడు అందులోనుండి వచ్చే కంపేషన్ వలన వారికి ఆ సబ్జక్టు అవగాహన అవుతుంది. జీవితం పొడుగునా ప్రసంగాలు చేసి తెలియపర్చలేనిది ఆ మౌనంలో ఒక్క క్షణంలో ఇతరులకు నువ్వు తెలియపర్చవచ్చు. ఆ శక్తి మౌనానికి ఉంది. అయితే ఆ మౌనం హృదయగతమైన మౌనం. జ్ఞాని ఏమి చేస్తాడు అంటే నిన్ను అనుగ్రహిస్తున్నాడు అనుకో అది నీ ప్రక్కవాడికి కూడా తెలియనివ్వడు. వారు మౌనంగానే పనిచేస్తారు. సత్యానికి పబ్లిసిటీ అక్కరలేదు. నువ్వు కూడా అలా ఉంటేనే అది నీకు ఎరుకలోనికి వస్తుంది. కాని మనం ఎవరికైనా చిన్నగడ్డిపరక ఇస్తే దానికి పెద్ద పబ్లిసిటీ కావాలి.

మీరు మంచిపనులు చెయ్యండి. ఒక మంచిపని చేస్తూ నువ్వు చనిపోతే నీకు స్వర్గం వస్తుంది. ఆ పనిలో సక్సెస్ అయితే కీర్తి వస్తుంది. నీ శరీరం చనిపోయినా నువ్వు సాధించింది సూర్యచంద్రులు ఉన్నంతకాలం ఉంటుంది. మేము బతికి ఉండగా చనిపోయిన వారితో సమానము. మీరు మంచిపనులు చేస్తే శరీరాలు చనిపోయినా ఈ లోకంలో జీవించే ఉంటారు, మల్లెపూవు ప్రక్కన కూర్చొన్నప్పడు మల్లెపూవుల వాసన వస్తుంది. నేను వాసన ఇవ్వాలి అని మల్లెపూవు అనుకోదు. అలాగే ఒక మహాత్ముడు, ఒక మహర్షి సమక్షంలో ఉన్నప్పడు ఆయన నుండి జ్ఞానతరంగాలు, కాంతితరంగాలు నీకు రావటమే కాకుండా, నేను బాగుపడాలనే తలంపు కూడా నీకు వస్తుంది. మీరు తొందరపడకూడదు. ఏకాలంలో ఏది జరగాలో అది జరుగుతుంది కాని మనం తొందరపడటం వలన ఏమీ రాదు.

మనం ఏదైనా పుస్తకం చదివేటప్పడు అంతా జ్ఞాపకం పెట్టుకోనక్కరలేదు. ఈ వాక్యం మనకు అవసరం, ఇది మన జీవితానికి ఉపయోగపడుతుంది అనుకొన్న దానిని మన

హృదయంలో అయినా దాచుకోవాలి లేకపోతే పుస్తకంలో అయినా వ్రాసుకోవాలి. ఆ వాక్యం మన హృదయంలో కాపురం ఉండాలి. రాత్రి ఒంటిగంటకు మెలకువ వస్తే ఆ వాక్యం నీకు గుర్తుకు రావాలి. డబ్బు సంపాదించే వారు ఎందుకు సంపాదించుకొంటారు. అవసరమైతే ఉపయోగపడుతుంది అని డబ్బు సంపాదిస్తారు. అలాగే నువ్వు చదివిన చదువుకూడా అవసరమైనప్పుడు నీకు ఉపయోగపడాలి లేకపోతే ఆ చదువు ఎందుకు? పుస్తకంలో ఉన్న సారం మీ మస్తకంలోనికి రావాలి. మీ మస్తకంలోనికి వస్తే అది మీకు ఉపయోగపడుతుంది లేకపోతే ఉపయోగపడదు. బ్రాహ్మీస్థితి పొందటానికి నీకు ఉన్న తెలివి తేటలను ఉపయోగించుకో లేకపోతే ఆ తెలివితేటలవలన నీకు ప్రయోజనం ఏమీలేదు. నీ కంటిలో ఉన్న దూలాన్ని చూసుకోవటం మానేసి ఎదుటివాడి కంటిలో ఉన్న నలుసును చూస్తావేమిటి? అంటాడు ఏసు. అంటే నీకు రంధ్రాన్వేషణ అలవాటు అయిపోయింది. నీకు శాంతి కావాలంటే, నీ మనస్సు నిర్మలంగా ఉండాలంటే ఇతరులలో ఉన్న దోషాలను చూడకు, నీకు రంధ్రాన్వేషణ వద్దు.

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 05-03-2015, చించినాడ)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం చేసే కర్మలో భక్తి ఉండాలి, జ్ఞానం ఉండాలి. ఈ రెండూ కలిపి చేసిన కర్మ సఫలమవుతుంది, అది పదిమందికీ ఉపయోగపడుతుంది. అలా కర్మ చేసిన వారు ధన్యులు అవుతారు. వారు మాత్రమే పరలోకరాజ్యానికి వెళ్ళటానికి అర్హులు అవుతారు. సర్వసాధారణంగా మనకు ఏమి కట్టుకొంటున్నాము, ఏమి తింటున్నాము అనే గొడవేకాని మన చుట్టూ సమాజం ఉందనే దృక్పథం మనకు చాలా తక్కువ. మన శరీరాలు అన్నీ చనిపోయే శరీరాలే. ఈ శరీరం చనిపోకముందే మనం చావులేనిస్థితిని పొందాలి, అదే మన జీవితగమ్యం. మన హృదయంలో అనేక కోరికలు, ఆకర్షణలు, వాసనలు, పూర్వజన్మ సంస్కారాలు, భోగాలు అనుభవించాలనే దృక్పథం ఇలా అనేకం ఉంటాయి. వీటిలోనుండి హృదయాన్ని ఖాళీ చేయటం చాలా కష్టమైన పని. వెయ్యికోట్లు డబ్బు సంపాదించవచ్చు, అనేక భవనాలు కట్టవచ్చు కాని మన హృదయంలో ఉన్న బలహీనతలను తొలగించి హృదయాన్ని ఖాళీ చేయటం ఎవరో కొంతమందికే సాధ్యం. మనం సాధన చేసినా ఇందులో సక్సెస్ అవ్వలేము. దీనికి అంతర్యామి యొక్క దయ ఉండాలి.

మనలను, మన కళ్ళకు కనిపిస్తున్న ఈ ప్రపంచాన్ని, పంచభూతాలను నడిపించే వాడే ఈశ్వరుడు. ఆయనే ప్రభువు. మనలను పరిపాలించేవాడు కైలాసంలో ఉన్నాడా, వైకుంఠంలో ఉన్నాడా, కాశీలో ఉన్నాడా, అరుణాచలంలో ఉన్నాడా అంటే ఆయన మనకు ఎక్కడో దూరాన లేడు మనలో అంతర్యామిగా మన హృదయంలోనే ఉండి ప్రారబ్ధం

ననుసరించి మన శరీరాలను నడిపిస్తున్నాడు. మన చేతులతో చేసే పనులకు, మన మెదడులోనికి వచ్చే తలంపులకు, మనలోపల వచ్చే రియాక్షన్స్‌కు అన్నింటికి సాక్షిగా మన హృదయంలో నివాసంగా ఉన్నవాడే ఈశ్వరుడు. ఏదైనా మంచి పని చెయ్యాలంటే చెయ్యటం మన ఇష్టం కాదు, చెయ్యకపోవటం కూడా మన ఇష్టంకాదు, అది ఈశ్వర నిర్ణయం.

మీరు ఫలకాంక్షతో పనిచేసినా, ఫలకాంక్ష లేకుండా పనిచేసినా ఫలితం వస్తుంది. మీరు నిష్కామంగా పనిచేస్తున్నప్పటికీ అక్కడ జ్ఞానం ఉండాలి. మీరు చేసేపని సమాజానికి ఉపయోగపడుతుందా లేక కుటుంబానికి ఉపయోగపడుతుందా లేక ఈ పని చేసినందుకు ఈశ్వరుడు సంతోషించి ఆయనకు మనపట్ల ప్రేమకలిగి మన హృదయంలో ఉన్న వాసనల నుండి మనలను విడుదల చేస్తాడా, అసలు మనం చేసే పని భగవంతుడికి సమ్మతమేనా అని మనం పనిచేసే ముందు వివేకంతో ఆలోచించుకోవాలి. మనం చెప్పే మాటలు, మనం చేసే కర్మ, మనకి ఉన్న ఈ సత్సంగాలు, మన జీవితవిధానం ఇవి అన్నీ కూడా మన హృదయంలో అంతర్గతంగా ఉండి, మనకు పునర్జన్మను తీసుకొని వచ్చే కోరికలు, వాసనల నుండి విడుదల పొందటానికి మనకు ఏమైనా సహాయం చేస్తున్నాయా అనేది చూసుకోవాలి. లోపలఉన్న వాసనలలోనుండి విడుదలపొందకుండా వాటిని సంతృప్తిపరుచుకొంటూ వెళితే నిప్పు మీద కిరసనాయిలు పోస్తే మంట ఎలా పెరిగిపోతుందో అలా ఆజన్మకాజన్మ ఈ వాసనలు బలపడిపోయి నీకు అనేక జన్మలను తీసుకొనివస్తాయి, ఇలా శవాలను మోస్తూ ఉండవలసిందే. అందుచేత దేవుడు ఉన్నాడా, లేడా అనేది ఇక్కడ సమస్యకాదు. హృదయాన్ని పరిశుద్ధం చెయ్యాలి. వాసనాక్షయం అయినవాడికి హృదయశుద్ధి కలుగుతుంది కాని వాసనాక్షయం కానివాడికి హృదయశుద్ధి కలుగదు. మనకు వేరుగా ఉన్న ఈ శరీరం, మనస్సు, ఈ సంస్కారాలు, ఈ సుఖాలు, దుఃఖాలు వీటి అన్నింటిలో నుండి మనం విడుదల పొందకుండా మనకి స్వరూపం తాలుక అనుభవం కలుగదు. ఇక్కడ మనం భగవంతుడిని దర్శించటం ముఖ్యంకాదు. మన హృదయంలో వాసనాక్షయం ముఖ్యం. ఒక్క వాసన మిగిలిపోతే పునర్జన్మ వచ్చేస్తుంది, మరల శవాలను మోయవలసిందే. ఏమో అప్పుడు పరిస్థితులు ఎలా ఉంటాయో చెప్పలేము. దీపం ఉండగా మనం చదువుకోలేనప్పుడు దీపం ఆరిపోయాక ఏమి చదువుతాము. ఇప్పుడు శరీరం ఉంది, వయస్సు ఉంది, పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి, ఇప్పుడే మనం సాధన చేయలేనప్పుడు శరీరం చనిపోయాక ఏమి సాధన చేస్తాము.

బయట వ్యక్తులనుండి, వస్తువులనుండి, పరిస్థితుల నుండి వచ్చే సుఖాలు, సంతోషాలు ఇవన్నీ డిపెండెంట్, ఇవి కాలప్రవాహంలో కొట్టుకొనిపోతాయి. దుఃఖం కూడా అంతే, దుఃఖం కూడా నిలబడదు, అదీ కాలప్రవాహంలో కొట్టుకొనిపోతుంది. ఏది సత్యంకాదో, ఏది నిత్యంకాదో, ఏది నీకు అపకారం చేస్తుందో, ఏ పనిచేస్తే అది నిన్ను బంధిస్తుందో, ఏ మాటలు

మాట్లాడితే అవి నిన్ను బంధిస్తాయో వాటిలో నుండి విడుదల పొందటమే సాధన యొక్క లక్ష్యం. మీరు రాత్రి నిద్రపోయిన తరువాత ఉదయం నిద్రనుండి ఎలా మేల్కొంటారో అలాగే చీకటి నుండి వెలుతురులోనికి, అసత్యంనుండి సత్యంలోనికి, బంధం నుండి మోక్షంలోనికి హృదయంలో మీకు మెలుకువరావాలి. అదే మీకు కడసారి జన్మ. ప్రపంచంలో అనేక ఆకర్షణలు ఉంటాయి. మనకు ఉన్న ప్రాపంచిక వ్యామోహాలను, అజ్ఞానాన్ని పెంచేవారు మనకు బంధువులు అయినా, స్నేహితులు అయినా వారి నుండి మర్యాదగా దూరంగా తప్పకోవాలి. ఎందుచేతనంటే ఈ శరీరగతమైన అనుబంధాలు అన్నీ తాత్కాలికం. ఎవరూ ఎవరికీ ఏమీ కారు అని ఆచార్యులవారు చెప్పారుకదా. వారు నావారు, వీరు నావారు అనుకొంటూ నువ్వు కూర్చుంటే భగవంతుడు నీవాడు ఎలా అవుతాడు. ఎవరూ నీవారు కాదు అని నీకు అనుభవంలోనికి వచ్చినప్పడే భగవంతుడు నీవాడు అవుతాడు.

మీ జీవితంలో ఒక ధనం విషయంలోగాని, పాండిత్యం విషయంలోగాని, కీర్తి విషయంలోగాని మోక్షమేకాదు ఈ లౌకికవిషయాలలో కూడా మీరు ఏదైనా సాధించి ఉంటే అది ఈశ్వరుడు సాధించిపెట్టిందేకాని అది మీ తెలివితేటల వలన సాధించిందికాదు. ఒక మనిషి ఎలక్షన్‌లో నెగ్గినా, ఓడిపోయినా దానికి పూర్వజన్మలకు సంబంధం ఉంటుంది. ఈ గోడ ప్రక్కన ఏముందో మనకు తెలియదు. ఇంక మనకు పూర్వజన్మలగురించి ఏమి తెలుస్తుంది, రాబోయేజన్మల గురించి ఏమి తెలుస్తుంది. ఇప్పడు ఈ శరీరాలు ఎలా ఉన్నాయో పూర్వం కూడా మనం అనేక శవాలను మోసాము. అయితే మనం ఏ దేహంలో ఉన్నప్పడు అది ఒక్కటే నిజం అని అనిపిస్తుంది. అదే మాయ. ఏదైతే లేదో అది ఉంది అనుకోవటమే మాయ. సత్యం కానిది సత్యంవలె చూపించేదే మాయ. అర్జునా! మాయ నాలో భాగం, నా దయలేకుండా ఈ మాయలో నుండి బయటకు వచ్చిన జీవుడు ఇంత వరకూ ఎవడూ లేడు అని పరమాత్మ చెప్పాడు. రమణమహర్షిగారికి మరణానుభవం కలిగింది అంటే అది ఈశ్వరానుగ్రహం. అలాగే మీలో ఎవరికైనా బ్రహ్మానుభవం కలిగింది అంటే దాని వెనకాల ఈశ్వరానుగ్రహం లేకుండా ఏమీ జరగటానికి అవకాశం లేదు. మీకు ధనాన్ని ఎంజాయ్ చేసే ప్రారబ్దం ఉన్నప్పడు ధనం వస్తుంది, అధికారాన్ని ఎంజాయ్ చేసే ప్రారబ్ధం ఉన్నప్పడు అధికారం వస్తుంది, ఇదంతా చేసేవాడు జీవుడుకాదు, ఈశ్వరుడే. ఆయనే మన హృదయంలో ఉండి ఇదంతా చేస్తున్నాడు, మనలను పాలిస్తున్నవాడు ఆయనే. ఈమధ్య ఒకరు నాతో మాటల సందర్భంలో ఏమన్నారు అంటే నాకు ఏమీ కోరికలు లేవు అని చెప్పారు. ఆయనకు వందకోట్ల ధనం ఉంది. నాకు ఏమీ కోరికలు లేవు, నేను చేయవలసిన పనులు లేవు, వాసనలు లేవు అంటున్నారు. ఆయన చెప్పటం సిన్సియర్‌గానే చెప్పారు. అప్పడు నేను ఒకటి చెప్పాను. మీరు చెప్పేది కనుక నిజమైతే మీకు బ్రహ్మానుభవం కలగాలి. మరి

బ్రహ్మానుభవం కలిగిందా అంటే లేదు. అయితే అది అబద్ధం. ఆయన అబద్ధాలు చెప్పాలని చెప్పటంకాదు, తెలియనితనం వలన అలా మాట్లాడుతున్నారు.

నీకు ఏదైనా కోరిక బలంగా ఉంటే ఈ జన్మలో కాకపోతే రాబోయే జన్మలో అయినా తప్పక నెరవేరుతుంది. కోరిక నెరవేరినప్పుడు దాని ఫలితాన్ని మీరు ఎంజాయ్ చేస్తారు. ఫలితాన్ని ఎంజాయ్ చేసినప్పుడు అది వాసన కింద పడుతుంది. ఆ వాసన మరల సంసారాన్ని తీసుకొని వస్తుంది. అందుచేత నాకోసం పనిచెయ్యి అని పరమాత్మ చెప్పాడు. నాకోసం పనిచెయ్యి ఈ సృష్టి అంతా ఈశ్వరుడు వ్యాపించి ఉన్నాడు. మీరు అందరూ శివస్వరూపమే, కాని నాకు ఉన్న అజ్ఞానం వలన మీరు జీవుడి కింద కనిపిస్తున్నారు. ఒకవేళ మీలో వాసనలు ఉన్నా అవి మీరు కాదు. ఒకవేళ ఏదైనా రాంగ్‌తింకింగ్ మీలో ఉన్నా అది మీరు కాదు ఏ సంస్కారాలు, ఏ కోరికలు అయితే మనలో ఉండి మనలను క్షోభ పెడుతున్నాయో వాటిలో నుండి మనం విడుదల పొందటానికి ప్రయత్నం చేయాలి. కాలం కలిసిరావాలి. వీటితోపాటు ఈశ్వరానుగ్రహం ఉండాలి. ఇవన్నీ కలిసి వస్తేనే కాని మనం అజ్ఞానంలోనుండి, అవిద్యలోనుండి, బంధంలోనుండి విడుదల పొందలేము.

నువ్వు ఏదైనా మంచిపని చేసినా చేసి వదిలేయాలి కాని దాని ఫలితం కోసం ఎదురు చూడవద్దు. ఫలితం వస్తుంది లేకపోతే రాదు, అది ఈశ్వరుడి చేతిలో ఉంది కాని నీ చేతిలో లేదు. నీ చేతిలో ఉన్న పనిని ఏకాగ్రంగా, పవిత్రంగా చెయ్యి, ఇతరుల యొక్క హితవుకోరి చెయ్యి. వారిలో నిన్ను చూసుకొని చెయ్యి. అప్పుడు నీ హృదయంలో మేలుకొలుపు వస్తుంది. పనిచెయ్యటానికే నీకు అధికారం ఉంది కాని ఫలితం మీద నీకు అధికారంలేదు. కొంతమందికి చిన్న పని చేస్తే పెద్ద ఫలితం వస్తుంది. కొంతమందికి పెద్దపని చేసినా చిన్న ఫలితం వస్తుంది. అదంతా ఈశ్వరనిర్ణయం. అందుచేత మీరు శారీరక, మానసిక ఆరోగ్యాలు కాపాడుకొంటూ, రాగద్వేషాల యొక్క వేగం తగ్గించుకొంటూ, సత్కర్మను నిష్కామంగా చేస్తూ, నీ కుటుంబ అవసరాలకు పోగా మిగిలి ఉంటే ఎంతోకొంత సమాజానికి ఉపయోగపడు. అయితే సమాజరూపములో ఉన్నవాడు కూడా ఈశ్వరుడే.

మీరు నిద్రపోతున్నారు. మీరు ఏదైతే కాదో ఆ విషయాల నుండి గాఢనిద్రలో మీరు విడిపోతున్నారు. గాఢనిద్రలో మీరు శరీరంనుండి విడిపోతున్నారు, మనస్సునుండి విడిపోతున్నారు, ప్రపంచం నుండి విడిపోతున్నారు, పుణ్యపాపాలనుండి విడిపోతున్నారు, లాభనష్టాల నుండి విడిపోతున్నారు, సెక్స్ నుండి విడిపోతున్నారు, ధనంతో విడిపోతున్నారు, దేవుడు యజ్ఞాలు యాగాలు వీటినుండి విడిపోతున్నారు. గాఢనిద్రలో మీకు పూర్వజన్మల గొడవ, పునర్జన్మలగొడవ, చావుపుట్టుకల గొడవ ఏమీలేదు, అక్కడ ఏ గొడవ మీకు లేదు.

గాఢనిద్రలో మీకు ఏమీ తెలియదు. గాఢనిద్రలో ఏగొడవ లేకుండా మీరు ఎక్కడైతే ఉన్నారో అక్కడనుండే మీరు వచ్చారు. గాఢనిద్రలో మీరు ఎక్కడైతే ఉన్నారో జాగ్రదవస్థలో అక్కడకు చేరుకోవటానికి మీరు ప్రయత్నం చేయాలి. మనం ఎక్కడనుండి వచ్చామో అక్కడకు వెనక్కి వెళ్ళిపోవటమే మోక్షం. సత్పురుషులతోటి, మహర్షులతోటి సాంగత్యం, సత్కర్మ ఆచరించటం, మంచి చేయటం, మంచిగా ఉండటం ఇవి అన్నీ కూడా మనం ఎక్కడనుండి వచ్చామో తిరిగి అక్కడకు చేరుకోవటానికి అంటే నేను అనే తలంపు ఎక్కడైతే పుట్టి వస్తోందో దాని మూలంలోనికి వెళ్ళటానికి సహకరిస్తాయి. మనం మంచి పనులు చేయగలము కాని మంచిగా ఉండటం అంటే హృదయంలో పవిత్రంగా జీవించటం కష్టం. మనకు మెదడు ఎంత ముఖ్యమో హృదయం కూడా అంతే ముఖ్యం. మనం మెదడును, హృదయాన్ని ఐక్యం చేసి జీవిస్తే నిర్వాణస్థితిని పొందుతాము.

నువ్వు ఎన్ని నేరాలు చేసినా ఎంతపెద్ద పొరపాట్లు చేసినా అవి ఈశ్వరుడు క్షమించలేనంత పెద్దవికావు. నేను పెద్ద నేరం చేసాను, పెద్ద పొరపాటు చేసాను అని నీవు అనుకోవచ్చు. ఈశ్వరానుగ్రహం ఉంటే వాటినన్నింటిని చెరిపేస్తాడు. మనం లోపల కుళ్ళిపోయి ఉన్నాము. అందుచేత మనకు చెడుతలంపులు వస్తూ ఉంటాయి. చెడుతలంపులు వచ్చినప్పుడు కంగారుపడవద్దు, వాటిని అణిచివేయటానికి ప్రయత్నం చేయవద్దు. వాటిని రానివ్వండి, మీరు ఎక్కడికి పారిపోవద్దు, వాటిని యాక్షన్‌లో పెట్టకండి. దీని పరిణామం ఎలా ఉంటుంది, భవిష్యత్ ఎలా ఉంటుంది అని మనస్సుతోటి చూడండి. అక్కడ మీ వివేకాన్ని ఉపయోగించండి. ఈ పని చేస్తాము దీని పరిణామం ఎలా ఉంటుంది? దీనిని ఈశ్వరుడు అంగీకరిస్తాడా? అంగీకరించడా? ఇది చెయ్యమన్నాడా? లేక వద్దని చెప్పాడా? అని అక్కడ ఈశ్వరుడిని గైడ్‌గా తీసుకోవాలి. ఇది విధా లేక నిషేదమా అనేది చూసుకోవాలి. మీ అమ్మగారిని మీరు బాగా చూస్తున్నారు అనుకోండి ఆ పని నుండి మీరు పుణ్యం ఆశించ కూడదు. ఎందుచేతనంటే అమ్మను చూడటం అది మీ డ్యూటీ. భగవంతుడు చెయ్యమన్నాడు కాబట్టి చెయ్యటం. భగవంతుడు ఒక పని చెయ్యి అని చెపుతాడు, ఒక పని వద్దు అని చెపుతాడు. చెయ్యమన్న పని ఎందుకు చెయ్యమంటున్నాడో, వద్దని చెప్పిన పని ఎందుకు మానేయమంటున్నాడో అది మన బుద్ధికి అందదు. ఈశ్వరుడు చెప్పినట్లు మనం వింటే సరిపోతుంది. ఎందుచేతనంటే మనలను మహోన్నతమైన స్థాయిలోనికి, దేవతలు కూడా మిమ్మల్ని చూసి అసూయపడే మహోన్నతమైన సుఖంలోనికి శాంతిలోనికి తీసుకొని పోవటానికే ఈ విధి, నిషేధాలను పెట్టారు కాని అందులో ఏమీ స్వార్థం లేదు.

ఈ శరీరం ఎవరిది అంటే మనస్సుది. ఈ శరీరాన్ని నేను అని మనస్సు అనుకొంటోంది, కాబట్టి శరీరం చనిపోయినప్పుడు నేను చనిపోతున్నాను అని మనస్సు అనుకొంటోంది. మీ

శరీరాలు చనిపోతాయి, నా శరీరం చనిపోతుంది. కంగారు పడకండి. శరీరం చనిపోయాక మీరందరు కొంతకాలం నిద్రలోనికి వెళ్ళిపోతారు. మీరు నిద్రలో ఉన్నప్పుడు మీ ఇంటి దగ్గర ఉన్న కష్టాలు మీకు జ్ఞాపకం వస్తాయా? రావు. అలాగే ఈ జీవితంలో మీకు ఏ సంఘటనలు అయితే అశాంతి తీసుకొని వచ్చాయో వాటినుండి, మీ ఇంటి దగ్గర మీరు పడిన కష్టాలు, యాతనల నుండి మిమ్మల్ని విడుదలచేయటానికి మీ శరీరం నుండి జీవుడు ప్రక్కకు తప్పకొన్నాక మిమ్మల్ని కొంతకాలం గాఢనిద్రలోనికి పడేస్తాడు ఈశ్వరుడు. అందుచేత ఈశ్వరుడు దయామయుడు. మరల ఆ నిద్రలోనుండి మేల్కొన్న తరువాత జీవుడు వాడి ప్రారబ్దాన్నిబట్టి ఏదో లోకంలో తిరగవచ్చు. శరీరం చనిపోయింది కాని ఈ శరీరం నాది, ఈ శరీరమే నేను అని చెప్పేది నిద్రపోతుంది కాని దానికి మరణం లేదు. అక్షరమణమాలలో భగవాన్ ఏమన్నారు అంటే భౌతికమైన అగ్ని ఈ శరీరాన్ని కాల్చిబూడిద చేయకముందే నీలో ఉన్న జ్ఞానాగ్నిని పంపించి నాలో ఉన్న వాసనలను, పునర్జన్మ కారణాలను కాల్చి బూడిద చెయ్యి అరుణాచలా అంటారు భగవాన్. మీ మనస్సులో కోరికలు, వాసనలు, బలహీనతలు అనేక సీక్రెట్ బర్డెన్స్ ఉంటాయి. వాటిని మర్చిపోదాము అంటే మర్చిపోలేరు, ఆ జ్ఞాపకాలు మిమ్మల్ని తరుముకొంటూ వస్తాయి. పోనీ జపంచేసి, ధ్యానంచేసి వాటిని బయటకు గెంటుదాము అంటే అవి చాలా బరువుగా ఉంటాయి. ఆ సీక్రెట్ బర్డెన్స్ మీకు బరువుకాని ఈశ్వరుడికి బరువుకాదు. మీకు ఈశ్వరానుగ్రహం కలిగితే మీకు తెలియకుండా ఆయనే ఈ బరువైన రాళ్ళను బయటకు గెంటేస్తాడు. ఎప్పుడైతే ఈశ్వరుడు అలా చేసాడో ఇంక మీకు శవాలను మొయ్యవలసిన పనిలేదు.

దేవుడు అంటే ఉండటం. ఇది బాగా అర్థం చేసుకోండి. నాన్నగారు ఈ విషయం గురించి ఎక్కువగా చెపుతున్నారు అని మీరు అనుకోవచ్చు కాని ఇది మీ హృదయానికి పట్టిందో లేదో చూసుకోవటం లేదు. మనకు ఉండటం అంటే ఇష్టమా, చనిపోవటం అంటే ఇష్టమా? ఉండటం అంటేనే ఇష్టం. ఆ ఉండటమే దేవుడు. ఉన్నాను, ఆ ఉన్నదేదో నేనై ఉన్నాను. అది నేనై ఉన్నాను అంటే అది దేహానికి, ఇంద్రియాలకు, మనస్సుకు పరిమితమైనది కాదు. ఆ ఉన్నదేదో నీకు అనుభవంలోనికి రావాలంటే ఇంద్రియాలు, మనస్సు నీ యజమాని ఏ హృదయంలో అయితే ఉన్నాడో అక్కడకు వెళ్ళి లయం అవ్వాలి. ఈ శరీరం ఏదో రోజు కాలి బూడిద అవుతుంది. శరీరం చనిపోయిన తరువాత కూడా నీవు ఉంటావు. కాని ఈ శరీరమే నేను అనుకోవటం వలన శరీరం పోయినప్పుడు నేను పోతాను, శరీరం పోయిన తరువాత నేను ఉండను అనుకొంటున్నావు. శరీరం పోయిన తరువాత కూడా మనం ఉంటాము అన్న సంగతి మనకు అనుభవంలోనికి రావాలి.

మన గొడవలు అన్నీ సాపేక్షికమైనవి. ఒకవేళ మీకు సంతోషం వచ్చినా, దుఃఖం వచ్చినా ఇవన్నీ సాపేక్షిక గొడవలు. పరిస్థితులనుబట్టి, మనుషులనుబట్టి వచ్చే గొడవలు.

ఇవి యదార్థంకాదు, ఇది అంతా స్వప్నమే. మేము బాగానే ఉన్నాము అని ఎవరైనా భగవాన్ దగ్గర అంటే, నువ్వు బాగున్నది కలలోనే కదా, ఈ బాగు కూడా కలలో ఒక భాగమే. అలాగే నీకు దుఃఖం వచ్చినా అదీ కలలో భాగమే. సృష్టిలో ఉన్న ఐశ్వర్యం అంతా ఈశ్వరుడిదే. నీకు ప్రారబ్దాన్నిబట్టి కొంత కేటాయిస్తాడు. ఆ ఐశ్వర్యాన్ని నువ్వు అనుభవించు. నిన్ను నోరు కట్టేసుకోమనటంలేదు. నువ్వు ఎంత తింటావో తిను. మిగిలింది దాచేసుకోవద్దు. తినగా మిగిలినదానిలో ఆయనకు కొంత కేటాయించు. అంటే సమాజరూపంలో ఉన్నవాడు ఈశ్వరుడే కాబట్టి సమాజంకోసం కొంత ఖర్చు పెట్టు. దీనికి భగవాన్ ఏమని చెప్పారు అంటే ఒకవేళ నువ్వు ఇతరులకు ఏదైనా సహాయం చేసినా అది నీకే తిరిగివచ్చేస్తుంది అది నీకు తిరిగి వస్తుందని తెలియకపోవటం వలన, నీలో ఉన్న అజ్ఞానం వలన నేను వారికి సహాయం చేసాను, వీరికి సహాయం చేసాను అని అనుకొంటున్నావు. సహాయం చెయ్యటానికి కాని, చెయ్యకపోవటానికి నువ్వెవరవు.

నాకు తిరిగి జన్మ వస్తుందా అని బుద్ధుడిని అడిగారు. నీకు శరీరం అవసరం ఉందా? నీకు శరీరం అవసరం అని నువ్వు అనుకొంటే జన్మ వస్తుంది. నాకు శరీరం అవసరం లేదు అని నీ హృదయంలో అనుకొంటే ఇంక శరీరం రాదు. నీకు దాహం వేస్తే మంచినీళ్ళు తాగుతావు. నీకు దాహం వేయనప్పుడు నేను మంచినీళ్ళు ఇస్తే వద్దు అంటావు. అలాగే నీకు నెరవేరవలసిన కోరికలుకాని, నీలో బలహీనతలుకాని ఏమీ లేకుండా అంతా శూన్యం అయిపోతే, పునర్జన్మను తీసుకొని వచ్చే ఆయిలు అంతా ఖర్చు అయిపోతే ఇంక నీకు శరీరం రాదు. మరి నీకు సినిమాలు చూడాలని ఉంటే శరీరం వస్తుంది కదా. శరీరం లేకుండా సినిమాలు ఎలా చూస్తావు. శ్రీకృష్ణచైతన్యుడిది మామూలు భక్తికాదు, ప్రేమభక్తి. ఆ ప్రేమభక్తి వల్లే ఆయన కృష్ణుడంతటివాడు అయ్యాడు. హరేకృష్ణ ఉద్యమం ప్రపంచం అంతా వ్యాపించింది. ప్రేమ అనేది ఏమీ అడగదు. ప్రేమ అనేది వ్యాపారంలాంటిదికాదు. ప్రేమకు ఇవ్వటం తెలుసు కాని అడగటం తెలియదు. మనం పని చేసేటప్పుడు పని జరుగుతూ ఉండాలి, మనిషి కనబడకూడదు అంటే వ్యక్తిభావన ఉండకూడదు. మనం ఎలా ఉన్నాము అంటే పని చెయ్యకపోయినా, మనమే చేసాము అని అందరూ అనుకోవాలి. కొంతమంది అయితే ఎవరో చేసిన పనిని కూడా వారే చేసినట్లు చెప్పకొంటారు. మన పద్ధతి ఇలా ఉంది. సద్వస్తువు ఇంపెర్సనల్, దానికి వ్యక్తిభావనలేదు. మన దైనందిన జీవితంలో పని జరుగుతూ ఉండాలి, మనం కనబడకూడదు. దానివలన ఈశ్వరుని దయ మన శిరస్సు మీద కురుస్తుంది.

బ్రాహ్మీస్థితి పొందిన వారి సాంగత్యం మంచిది. రామకృష్ణుడు ఏమన్నాడు అంటే పేడలో ఉన్న పురుగులను తీసుకొనివచ్చి బంగారపు గిన్నెలో వేస్తే ఉంటాయా మరి. మేము ఇక్కడ ఉండము పేడలోకే వెళ్ళిపోతాము అంటాయి, ఎందుచేతనంటే వాటికి పేడ అలవాటు

అయిపోయింది. మీరు కూడా అంతే. ఇంతకు ముందు మీరు ఉన్న కంపెనీ మంచిది కాకపోతే అంటే మీరు చెడు సహవాసాలతో ఉంటే అక్కడ నుండి హోలీకంపెనీలోకి రావటానికి మీరు ఇష్టపడరు. మీకు తెలుసున్నా, తెలియకపోయినా మీ హృదయంలో ఒక సత్యం ఉంది. గురువు యొక్క దయ, ఈశ్వరానుగ్రహం వచ్చి మీ శిరస్సుమీద పడుతున్నప్పుడు మీకు ఊపిరికూడా ఆడదు, మీరు ఉక్కిరిబిక్కిరి అయ్యేటంత శాంతి వచ్చి మిమ్మల్ని ముంచేస్తుంది. ఇప్పటివరకు మీ జీవితంలో శారీరకంగాకాని, మానసికంగాకాని అటువంటి శాంతిని మీరు అనుభవించలేదు. అప్పడు మీరు సుఖసముద్రంలో, ఆనందసముద్రంలో ఊగిసలాడతారు. అప్పడు భగవంతుడే వచ్చి మీ ప్రక్కన కూర్చొన్నా మీకు చూడాలనిపించదు, ఇష్టంలేకకాదు అవసరంలేక. వాడు భగవంతుడే అయినా మీరు అనుభవించే శాంతిలో వాడు ఒక తుంపర. గురువు మీమీద తీర్పులు చెప్పడు. మీ సాధనతో సంబంధంలేకుండా, మీ మానసికస్థితి ఎలా ఉన్నా మీ హృదయంలో ఉన్న నిజాన్ని మీకు ఎరుకలోనికి తీసుకొని వస్తాడు, వాడు గురువు. మీరు మంచివారని, మీరు మంచివారు కాదని ఇటువంటి తీర్పులు చెప్పడు. జ్ఞానానికి పునాది మంచితనం కాబట్టి, మీరు మంచిగా ఉండటానికి ఏ విషయాలు అయితే అడ్డు వస్తున్నాయో చూసి మీకు తెలియకుండా ఆపరేషన్ చేసి వాటిని బయటకు తీసేస్తాడు, వాడు గురువు. ఆయనకు మీపట్ల ఉన్న దయ వలన ఇదంతా గురువు చేస్తాడు. ఎప్పుడైనా ఎవరైనా ఒక పొరపాటు చేస్తే అంతమాత్రంచేత వాడు దుర్మార్గుడు అనికాదు. కొంతమంది మనుషులను అవసరాలు అలా చేస్తాయి. మీరు కంగారుపడి వారి మీద తీర్పులు చెప్పకండి. అదే పరిస్థితులలో నేను ఉంటే నేను ఎలా ప్రవర్తిస్తాను అని మీరు ప్రశ్న వేసుకోవాలి.

ఏమండీ పరమహంసగారు మీరు నావంకే ఎక్కువగా చూస్తున్నారు. అందరివంకా సమానంగా చూడండి. ఇక్కడ ఎవరూ భక్తులు లేరా, నావంకే ఎక్కువ సేపు అలా చూడకూడదు, అందరివంకా చూడాలి అంటాడు నరేంద్రుడు. రామకృష్ణుడు ఏమన్నాడు అంటే నువ్వు చెప్పిన విషయం నాకు తెలుసు. నీ వంక ఎక్కువసేపు చూడాలని చూడటంలేదు. చూడకుండా ఉండలేకపోతున్నాను కాబట్టి చూస్తున్నాను అంటాడు. అది జన్మాంతర అనుబంధం. మీకు జన్మాంతర అనుబంధం ఉంటే చనిపోయేవరకు స్నేహితులుగానే ఉంటారు. ఒకరిపొరపాట్లను ఒకరు క్షమించుకొంటారు. జన్మాంతర అనుబంధం లేనప్పుడు పొరపాట్లను పెద్దవి చేసుకొంటూ ఏదో పేచీలు పెట్టుకొని విడిపోతూ ఉంటారు. లవ్ ఎట్ ఫస్ట్ సైట్. కాశీలో మణికర్ణికాఘాట్‌లో ఆచార్యులవారు పద్మపాదుడు మొదట కలుసుకొన్నారు. అది జన్మాంతర అనుబంధం కాబట్టి వారి శరీరాలు పోయేవరకు అలాగే ఉండిపోయారు. అటువంటి స్నేహాలు ఇప్పుడు ఉండటం కష్టం. ఇప్పుడు లోకంలో అసలు కృతజ్ఞత అనేది లేదు. ఈ రోజు మీకు ఎవరైనా మంచి చేస్తే రేపే మర్చిపోతున్నారు.

అసలు తల్లిదండ్రులపట్ల కూడా కృతజ్ఞత లేదు. వారు మాకేమి ఇచ్చారు అనే ప్రశ్నేకాని వారికోసం మనం ఏమి చేస్తున్నాము అనే ప్రశ్న లేదు. గురువు మిమ్మల్ని ఎన్నుకోవటంవేరు, మీరు గురువును ఎన్నుకోవటం వేరు. మీరు గురువును ఎన్నుకొంటే అమావాస్యకు ఒకరు, పౌర్ణమికి ఒకరు ఇలా గురువులను మార్చేస్తూ ఉంటారు. అదే గురువు మిమ్మల్ని ఎన్నుకొంటే మీకు ఆత్మానుభవం కలిగేవరకు మిమ్మల్ని విడిచిపెట్టడు. ఒకవేళ ఈ శరీరం చనిపోయి మీరు కొత్త శరీరంలోనికి వెళ్ళినా మీ ఎడ్రసు తెలుసుకొని మిమ్మల్ని వెంటాడుతూ ఉంటాడు. బ్రాహ్మీస్థితి పొందేవరకు మిమ్మల్ని విడిచిపెట్టడు.

నరేన్ నీకు సొంత పనులు అంటూ ఏమీ లేవు, నాపని చేయటానికే వచ్చావు, నేను రమ్మంటే వచ్చావు. నీ 40వ జన్మదినోత్సవం చూసుకోకుండా నీ శరీరం చనిపోతుంది. ఎందుచేతనంటే అక్కడితోటి నీవు వచ్చిన పని పూర్తి అయిపోతుంది. మళ్ళీ నువ్వు ఎక్కడికైనా వెళతావేమో వెళ్ళకు, నా దగ్గరకే వచ్చేయి అంటాడు రామకృష్ణుడు. ఆ అనుబంధం విడదీయరానిది. వివేకానందుడికి అయినా, మీకైనా, నాకైనా ఆ శరీరం ద్వారా జీవుడు పొందవలసిన అనుభవాలు పొందినతరువాత, మీ శరీరం ఏవిధి అనుభవించటానికి వచ్చిందో అది పూర్తి అయిన వెంటనే మీ ముక్కులో గాలి ఆగిపోతుంది. మరణానికి సెలవులు లేవు. అది ఎప్పుడు వస్తుందో మనం చెప్పలేము. అందరికీ ఆత్మజ్ఞానం కావాలి. ఆత్మజ్ఞానానికి మించిన ధనంలేదు, ఆత్మజ్ఞానానికి మించిన పాండిత్యంలేదు, ఆత్మజ్ఞానానికి మించినది ఈ లోకంలోకాని, పరలోకంలోకాని ఏమీలేదు. ఆత్మజ్ఞానం కావాలి అని మీరు భగవంతుడిని అడగవద్దు. మీకు అర్హత ఉంటే, యోగ్యత ఉంటే మీరు దానిని పొందుతారు. అది మీకు ఎప్పుడు ఇవ్వాలి, ఎక్కడ ఇవ్వాలి, ఎలా ఇవ్వాలి ఆ ముహూర్తం ఈశ్వరుడు పెట్టుకొంటాడు. ఈశ్వరుడు ఎవరికి తెలియబడాలి అనుకొన్నాడో వాడికి మాత్రమే తెలియబడతాడు కాని నువ్వు అనుకొన్నంత మాత్రంచేత ఆయన తెలియబడడు. ఇది మీరు గుర్తు పెట్టుకోండి. అందుచేత ఆయన మీకు తెలియబడాలి అంటే మీ పట్ల ఆయనకు దయ కలగాలి. అందుచేత మీ మాట, మీ చేత, మీ తలంపులు అన్నీ కూడా ఈశ్వరుడు నిషేదించిన విషయాలలోకి వెళ్ళకుండా, ఈశ్వరుడు విధించిన విషయాలకే వెళ్ళాలి. అప్పుడు మీరు ఆయన దయకు పాత్రులవుతారు.

రామకృష్ణుడు చెప్పిన ఈ వాక్యాన్ని మీ బ్రెయిన్‌లో పెట్టుకోండి. నేను కర్తను కాదు, ఈశ్వరుడు మాత్రమే కర్త. నీకు జీవితంలో మంచి జరగవచ్చు, చెడ్డ జరగవచ్చు. ఏ సంఘటన జరిగినా నీకు గౌరవం వచ్చినా, అగౌరవం వచ్చినా, లాభం వచ్చినా, నష్టం వచ్చినా, ఐశ్వర్యం వచ్చినా, పేదరికం వచ్చినా ప్రతీ విషయానికి ఈశ్వరుడే కర్త, నేను కర్తనుకాదు అనుకోవాలి. కాని నువ్వు కర్తను అనుకొంటున్నావు కాబట్టి నీకు దుఃఖం వస్తోంది. నేను కర్తనుకాదు,

ఈశ్వరుడే కర్త అని నోటితో చెపితే సరిపోదు, మనస్సులో అనుకొంటే సరిపోదు, అది నీ హృదయంలో అనుభవంలోనికి రావాలి. అది నీకు అనుభవంలోనికి వస్తే నీకు బండెడు దుఃఖం ఉన్నప్పటికీ ఆ దుఃఖం వెంటనే ఆరిపోవటమే కాదు, మీరు కూర్చున్నవాళ్ళు నిలబడకుండా జీవన్ముక్తులు అవుతారు. ఈ శరీరం భూమి మీద తిరుగాడుతున్నప్పుడే మీరు మోక్షసుఖాన్ని పొందుతారు. మీ శరీరం చనిపోయిన తరువాత ఇంక ఏ లోకాలకు వెళ్ళవలసిన అవసరం లేదు. మీరు పొందవలసింది పొందాక అసలు దేవుడు ఉన్నాడా లేడా అనే సమస్య కూడా మీకు రాదు. గురువు మిమ్మల్ని మాటద్వారా అనుగ్రహించగలడు, చూపుద్వారా అనుగ్రహించగలడు, మౌనం ద్వారా అనుగ్రహించగలడు. హృదయం హృదయంతో మాట్లాడేటప్పుడు మాటలతో పని ఏముంది? భగవాన్ ఏదైనా చెప్పారు అనుకోండి, అది మాట కాదు, మాట రూపంలో ఉన్న అనుగ్రహం. తులసీదాసుగారి భార్య ఒకసారి ఆయనతో ఏమంది అంటే నీకు నామీద ఉన్న అనురాగం, నీకు నామీద ఉన్న ప్రేమ రాముడిమీద ఉంటే ఈపాటికి మహాజ్ఞానివి అయిపోదువు అని మాటవరసకి అంది. ఆ మాట తులసీదాసుగారి భార్య అనటంకాదు, ఆవిడలో అంతర్యామిగా ఉన్న నారాయణుడు అనిపించాడు. ఆ ఒక్క వాక్యంతోటి తులసీదాసు హృదయంలో జ్ఞానోదయం అయ్యింది. అక్కడ నుండి లెగిసి వెళ్ళిపోయాడు. గొప్ప గ్రంధం తులసీ రామాయణం రాసాడు.

గుడులుచుట్టూ తిరగటం, తీర్థయాత్రలకు వెళ్ళటం ఇవన్నీ సెకండరీ. ఇవన్నీ కూడా ఒక మహర్షియొక్క చూపుతోటి సరికావు. ఎందుచేతనంటే వారి చూపు అనుగ్రహం, వారి మాట అనుగ్రహం, వారి కోపం కూడా అనుగ్రహం, వారి ప్రతీ కదలిక కూడా అనుగ్రహమే. నీకు వాసన ఉన్నంతసేపు అది రిపీట్ చెయ్యాలనిపిస్తుంది. నీ అంతట నువ్వు వాసనాక్షయం చేసుకోలేవు. మహర్షుల సమక్షంలో, బ్రాహ్మీస్థితి పొందినవారి సమక్షంలో వాసనలు నెమ్మదిగా అణుగుతాయి. మనస్సు నిర్మలమవుతుంది, మనస్సు నిశ్చలమవుతుంది, మనస్సుకు ఏకాగ్రత వస్తుంది, మనస్సుకు పవిత్రత వస్తుంది. క్రమేణ నీకు సమాధిస్థితి కలుగుతుంది. ఇప్పుడు నీకు శరీరం ఎలా ఎరుకలో ఉందో, నీ మనస్సు నీకు ఎలా ఎరుకలో ఉందో, నీ మనస్సులో జరిగే ఘర్షణలు ఎలా నీకు ఎరుకలో ఉన్నాయో అలాగ నీ హృదయంలో ఉన్న సత్యం మహర్షుల అనుగ్రహం వలన నీకు ఎరుకలోనికి వచ్చి నువ్వు సిద్ధపురుషుడు అవుతావు. ఇప్పుడు నువ్వు ఎలా ఉన్నావో నిన్ను అలాగే ఉంచేయాలి అని జ్ఞాని ఎవడూ అనుకోడు. తనంతవారిగా చేయటానికి, తను ఏ స్థితిలో ఉన్నాడో ఆ స్థితిని నీచేత పొందింపచేయటానికి ప్రయత్నం చేస్తాడు. వాడు జ్ఞాని.

నీకు సద్వస్తువు అనుభవంలోనికి రాకుండా ఏ వాసనలు అయితే నీకు అడ్డుగా ఉన్నాయో వాటిని అణుస్తాడు. లేనిదానిని లేనట్లుగా నీకు ఎరుకపరచి ఉన్న వస్తువును

ఉన్నట్లుగా నీకు అనుభవంలోనికి తీసుకొనివస్తాడు. నువ్వు జన్మలతరబడి, సంవత్సరాల తరబడి సాధన చేసి పొందలేనిది ఈశ్వరుని దయ ఉంటే ఒక్క క్షణంలో నీకు వస్తుంది. ఈశ్వరుడు అంటే ఈ గోడలాంటివాడు కాదు. ఈశ్వరుడికి స్పందన ఉంది. ఆయన నీ ప్రార్థనకు స్పందిస్తాడు, నీ సహృదయానికి స్పందిస్తాడు, నీ ఉపకారబుద్ధికి స్పందిస్తాడు, నీ జీవిత విధానానికి స్పందిస్తాడు. నీలో ఉన్న జీవలక్షణాలను నశింపచేయటానికి నీ మనస్సును హృదయంలో కొంతకాలం ముంచి ఉంచుతాడు. ఒకోసారి నువ్వు అనుకొన్న పనులు జరగవు. నువ్వు అనుకొన్నపని అవ్వకపోతే ఈశ్వరుడి మీద నీకు రియాక్షన్ ఎలా వస్తోందో ఆయన చూస్తూ ఉంటాడు. కిరసనాయిలు డబ్బా వాసన వస్తూ ఉంటే నీటితో కడిగితే ఆ వాసన పోదు, నాలుగు రోజులు ఎండలో పెడితే ఆవాసన పోతుంది. అలాగే మీ లోపలఉన్న వాసనలు క్షయమవ్వటానికి భగవంతుడు మీ తలకాయను ఎండబెడతాడు. ఇదంతా మీ మీద కోపంతో చేసేపనికాదు, ఇది అంతా ఆయన అనుగ్రహమే అని గ్రహించిన వారు అదృష్టవంతులు. మీ హృదయంలోఉన్న నిజం మీకు అనుభవంలోనికి వచ్చేవరకు మీరు ఏ శరీరంలో ఉన్నా ప్రతీజన్మకు గురువు మిమ్మల్ని వెంటాడుతూనే ఉంటాడు. మీకు సత్యానుభవం అయ్యేవరకు మిమ్మల్ని విడిచిపెట్టడు. వాడు గురువు.

మీరు ఏదో చెప్పకొనిపోతున్నారు, మీరు చెప్పే మాటలు మాకు అర్థమవ్వటంలేదు అంటే అవును మరి ఏంచేస్తాము? అలవాట్ల యొక్క వేగము వాసనల యొక్క వేగం అంత బలీయంగా ఉన్నది. అందుచేత నేను చెప్పిన మాటలను మీ మనస్సు అంగీకరించటంలేదు. మీరు మంచివారే కాని అలవాట్లయొక్క వేగం అలా ఉంది, చేసేది ఏమీ లేదు. అలవాట్ల యొక్క వేగము తగ్గేవరకు నేను చెప్పేది సత్యం అయినా మీకు అసత్యం కిందే కనిపిస్తుంది. అది మీ పొరపాటు కాదు, మీ అలవాట్ల యొక్క వేగం. కంగారు పడవద్దు. మీ హృదయంలో ఉన్న వాసనలను బలహీనపరచి మిమ్మల్ని ఆధ్యాత్మికంగా చాలా బలవంతుడ్ని చేస్తాడు. మీ దయ మాకు చూపించండి, మీ అనుగ్రహం మాకు కావాలి అని మీరు ప్రత్యేకంగా అడగవలసిన పనిలేదు. నా అనుగ్రహం మీకు లేదు అనుకోండి మిమ్మల్ని ఇక్కడకు ఎవరు తీసుకొనివచ్చారు? నా దయ లేకపోతే మీరు ఇక్కడకు రానే రారు. అనుగ్రహమే మిమ్మల్ని తీసుకొని వచ్చింది. నీ అవసరాలు ఏమిటో భగవంతుడికి తెలుసు. ఆయన సర్వజ్ఞుడు కాబట్టి మీ అవసరాలు ఆయనకు తెలుసు కాబట్టి మీరు నోరు తెరచి ఆయనను ఏమీ అడగనక్కరలేదు. ఈరోజున సబ్జక్టులో ముఖ్యమైనది ఏమిటి అంటే దేవుడు ఉన్నాడా లేడా అనికాదు, లోకం సత్యమా అసత్యమా అనికాదు. నీ హృదయంలో ఉన్న వాసనలను అంటే పునర్జన్మలు తీసుకొని వచ్చే కారణాలను ఎండింపచేయటమే మన జీవితగమ్యం. అలా మనం ఎండింపచేయలేము అనుకోండి మనకు భగవంతుడు ఉంటే ఏమిటి? లేకపోతే ఏమిటి?

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

**- Mahabharatha**

## లేఖ

**"ఉన్నది బ్రహ్మం ఒక్కటే"** అనే పుస్తకం పెక్కుసార్లు చదివాను. మహదానందం కల్గింది. వివేకచూడామణి వంటి అద్వైత గ్రంథాలతో పూర్వపరిచయమున్నా ఇంత విశదంగా, అనుభవపూర్వకంగా, లౌకికవిషయాలతో చక్కని సమన్వయంతో విశ్లేషించిన గ్రంథం ఇదే అన్పించింది. ప్రతివాని మనస్సులో నిత్యం తలెత్తే అనుమానాలు, అద్వైత బోధనలో, సాధనలో ఎదురయ్యే శంకలూ, శషభిషలూ, వాదోపవాదాలు ఇందులో ప్రస్తావించ బడినందువల్ల, అతి సామాన్యులైన మా వంటివారికి అద్భుతమైన ఉపశమన స్పర్శ కల్గింది. శ్రీ కె.వి. రమణగారు ప్రస్తావించిన ప్రశ్నలు సాధనాపథంలో ఎదురయ్యేవే! మనస్సు ఎంతో పూరట చెందింది. ఈ లేఖద్వారా నా కృతజ్ఞతలు తెల్పుకుంటున్నాను.

# పరాధీనతే - నరకం

దరిద్రం అన్ని పాపాలకు, అన్ని నేరాలకు మూలకారణం. దుఃఖంతో కొనసాగే వారు ప్రమాదకారులు. ఆ దురవస్థ జీవిత నాశనాన్ని సృష్టిస్తుంది. ఈశ్వరుడు ఇచ్చిన సంపదను, కాలాన్ని నిర్లక్ష్యం చేస్తే కూడు, గుడ్డ, నీడ, వైద్యానికి కరువై తాపత్రయాలతో జీవితం బాధామయమౌతుంది. కూలివానికి పని ఎక్కడ దొరుకుతుంది. తిండి ఎలా సమకూర్చుకోవాలి, కుటుంబాన్ని ఎలా గడపాలి అనే ఆలోచనే. గుడికి వెళ్ళినా భౌతికపదార్థాలను అడగటానికే. ప్రార్థన కాని కృతజ్ఞత ఉండదు, అతన్ని దయగానే చూడాలి. అతడు యజమానిని చూస్తే ఆయనకు లొంగిఉండాలి అనిపిస్తుంది. నిజానికి లొంగి ఉండేది పరమాత్మకే అనే స్ఫురణరాదు. భార్య, భర్తలకు పిల్లలకు ఒకరిపై ఒకరికి అధికారం ఏమిటి? ఒకరి అవసరాలు ఒకరు తీర్చటంలేదు, తదుపరి పోట్లాటలు, తదుపరి దైన్యం, ధైర్యాన్ని కోల్పోవటం. మన దురదృష్టం గురించి బాధపడటం కన్నా చాలామంది కన్నా అదృష్టవంతులమని మధ్యతరగతి వారు భావించాలి. సహనంతో, తృప్తితో జీవిస్తే భగవంతుణ్ణి ప్రేమించినట్లే. శ్రీ నాన్నగారు “మంచి ఆప్యాయతగల కుటుంబంలో జీవించటానికి వంద జన్మలు పడితే, దుర్మార్గ కుటుంబములో జీవితయాత్ర సాగితే ఒక్క జన్మలోనే తరిస్తావు” అన్నారు. నిరాశావాది తన చుట్టూ నరకాన్ని సృష్టించుకుంటాడు. బాధల కొలిమిలో పడ్డవారే పవిత్రులై పరమానందాన్ని అందుకుంటారు. శారీరక, మానసిక బాధలు భగవంతుడు ఇచ్చిన వరాలుగా భావించాలి. ఎవరైతే పూజితులు కాదలుచుకొన్నారో వారు మొదట పరిత్యాగవేదన అనుభవించవలసి వస్తుందని మహాత్ముల చరిత్రలు తెలియజేస్తుంది. కాబట్టి మనలను మనం చిత్రహింసలు పెట్టుకోకూడదు, బాధలను వెదుక్కొనే పనిలో మాత్రం ఉండకూడదు. వర్తమానంలో సహనంగా జీవించాలి. జీవితంలో పరమానంద పూరిత క్షణాలు, దైన్యపూరితమైన క్షణాలు ఉంటాయి. అవి వాటంతట అవి వస్తాయి, పోతాయి. మనం దైన్యాన్ని నిరోధించలేము. మన పూర్వజన్మల సంస్కారాల ధృడత్వం వాటికి ఉంది. ఈశ్వరుడే వాటిని ఫలింపచేస్తాడు. మనం కేవలం బలిపశువులము. సంతోషాన్ని సృష్టించుకోవటం మన చేతుల్లోనే ఉంది. ప్రార్థనాపూర్వకంగా విశ్వాసభరితంగా నిరీక్షించాలి. మనం మన పాపాలవల్లనే శిక్షించబడుతున్నాము మరి ఎవరివల్లకాదు అనే నిశ్చయానికి రావాలి. మహాత్ములు “ఆత్మజ్ఞానం ప్రాప్తించిన క్షణంలోనే దైన్యం మాయమౌతుంది అపుడు ఏదీ మన సొంతం కాదని తెలియటం వల్ల చింతలు, ఆందోళనలు, బాధ్యతలు ఉండవని” అంటారు. తెలియకపోవటంవల్ల గతంలో తప్పలు చేస్తాము తెలుసుండి అనుభవిస్తాము. ప్రాప్తించినదానికి తల ఒగ్గాలి. నిశ్చలులమై ఉండాలి మనం స్వతంత్ర జీవులమైనప్పడే సుఖపడి స్వేచ్ఛను అనుభవిస్తూ ఆనందించగలము. ఇతరులపై ఆధారపడి జీవించేవాడు సత్యదేవతను ఆరాధించలేడు. దైవం మనయందు ఉన్నాడని ఏకాంతగా ఉండాలి. తన కాళ్ళమీద తను నిలబడినవానికి అంతా బాగానే ఉంటుంది. మనిషిమీద ఆధారపడటం మానుకొన్నవానికి నారాయణుని సాయం అధికంగా వర్షిస్తుంది.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**